ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

నాగర్‌కర్నూల్ : విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ సంతోష్

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

- విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవాలి
- నులిపురుగులు కడుపులో ఉండడం వల్లే అనారోగ్య సమస్యలు
- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీలో కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 20 : నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, చిన్నారుల కడుపుల్లో నులిపురుగులు ఉండడం వల్లే అనారోగ్య సమస్యలు ఎదురై ఎదుగుదల ఉండదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిలిపురుగులు పిల్లలు ఆరుబయట ఆడుకున్నప్పుడు చేతులు కడుక్కోకుండా ఆహారం భుజించినపుడు, బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన చేయడం వల్ల అపరిశుభ్రత పరిసరాల వల్ల సంక్రమిస్తాయన్నారు. పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ ప్రభావం వల్ల రక్తహీనత, చురుకుదనం, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, విరోచనాలు లాంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయన్నారు. చెప్పులు లేకుండా నడవడం, మట్టిలో ఆడడం, చాక్‌పీస్‌లు, బలపాలు, మట్టిని తినడం వల్ల శరీరంలో నులిపురుగులు తయారవుతాయని వివరించారు. ఈ పురుగులు పేగులో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని, దీని వల్ల పిల్లలు భుజించిన ఆహారం ఒంటికి పట్టకపోవడంతో అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల నిలిపురుగులు పిల్లల శరీరం నుంచి బయటకు పోతాయన్నారు. జిల్లాలోని సంవత్సరం వయస్సు పిల్లల నుంచి 19 ఏండ్ల వయస్సు కలిగిన పిల్లలకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు పిల్లలకు స్వయంగా సిబ్బందిచే వేయడం జరుగుతుందన్నారు. ఈ మాత్రల ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు కలగవన్నారు. మాత్రలు ఆరోగ్య సిబ్బందిచే పంపిణీ చేయబడుతుందని, ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకొని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, డీఈవో గోవిందరాజులు, జిల్లా ఇమ్యూనైజేషన్‌అధికారి రవినాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాసు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటటౌన్/అచ్చంపేటరూరల్, జూన్ 20 : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేసినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మణ్ తెలిపారు. గురువారం అచ్చంపేట ప ట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ను లి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాత్రల వలన విద్యార్థులు చురుకుగా, ఎంతో ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ మాత్రలు సంవత్సరానికి రెండు సార్లు వేసుకోవాలని సూచించారు. విద్యాభ్యాస సమయంలో శుభ్రత పాటించకుండా కలుషిత ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల శరీరంలో నులిపురుగులు, కొంకి పురుగులు, ఎలిక పాములు తయారవుతాయని వాటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు విశేషంగా పనిచేస్తాయన్నారు. అచ్చంపేట మండలంలో ని 38 గ్రామ పంచాయతీల పరిధిలోని పాఠశాల విద్యార్థులకు గురువారం నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఐసీడీఎస్ సీడీపీవో దమయంతి తెలిపారు. గురువారం పట్టణంలోని 10వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె నులి పురుగుల నివారణ మాత్రలు చిన్నారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భూపా ల్, ప్రశాంత్, సుష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అశోక్ ప్రసాద్, ఏపీఎంవో మధుమోహన్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ నిరంజన్, పోషణ్ అభియాన్ ప్రదీప్, హబ్ వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్ సంధ్య, వర్కర్ బాలమణి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల, జూన్ 20 : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలో ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు నులి పురుగుల నివారణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు సతీశ్, శ్యాంసుందర్ గౌడ్, వైద్యసిబ్బంది జోన్స్, దేవి, శ్రీను, రజిత తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, జూన్ 20 : నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 9,250 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని బోయగేరి పాఠశాలలో ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి నులి పురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లీలావతి, ఎం ఈవో శ్రీనివాసులు, వైద్యాధికారులు ఇస్మాయిల్, నవీన్‌హుస్సేన్, పర్వీన్, ఉమేరా, సిబ్బంది గౌస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడేరు/పెంట్లవెల్లి మండలాల్లో..

కోడేరు/పెంట్లవెల్లి, జూన్ 20 : జా తీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కోడేరు, పెంట్లవెల్లి మండలాల్లోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో గురువారం చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. 0 నుం చి 19 సంవత్సరాల లోపు ఉన్న బా లబాలికలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏఎన్ఎంలు ఆశ కార్యకర్త లు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు ఆయా గ్రామాల వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దశరథం, ఎంపీటీసీ బైరోజు సుమలత శేషు, ప్రధానోపాధ్యాయుడు సీవీ రావు, ఉపాధ్యాయు డు అర్జున్‌గౌడ్, శ్రీధర్, నర్సింహ, రామకృష్ణ, వైద్యసిబ్బంది సంపూర్ణమ్మ, సుమిత్ర, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, జూన్ 20 : 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరి వేసుకోవాలని డాక్టర్ మాధురి అన్నారు. గురువారం మండలంలోని పాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల నులిపురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్, రాజేశ్వర్, గోవర్ధన్, జగవర్ధనమ్మ, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, జూన్ 20 : నులిపురుగుల నివారణ నివారణ మాత్రలను జెడ్పీటీసీ గౌరమ్మ విద్యార్థులకు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్, గురుకుల పాఠశాలలో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 0 నుంచి 19 ఏండ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలకు మాత్రలు వేయించాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని మారెడుమాన్‌దిన్నెలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్.ఎం విజయకుమార్, శ్రీనివాసులు, బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, జూన్ 20 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువా రం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో 1386 మంది బాలురు, 1490 మంది బాలికలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరలక్ష్మి, రాంచంద్రారెడ్డి, కలీంపాషాతో పాటు అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ, జూన్ 20 : నులి పురుగు నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల వైద్యాధికారి మంజుభార్గవి అన్నారు. మండలంలో గురువారం జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీలు, పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటు ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వంగూరులో..

వంగూరు, జూన్ 20 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు హమీద్, ఎంపీటీసీ రమేశ్‌గౌడ్, వైద్యాధికారి శృతి, సీహెచ్‌వో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల, జూన్ 20 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం బషీర్ అహ్మద్ మాట్లాడుతూ నట్టల నివారణకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలన్నారు. అదేవిధంగా మండలంలోని అప్పాయిపల్లి పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, జూన్ 20 : 18 ఏండ్లలోపు చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరి వేయించాలని రఘుపతిపేట ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అన్నారు. గురువారం రఘుపతిపేట, తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను (ఆల్బెండజోల్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

మిషన్ భగీరథ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంతోష్

బిజినేపల్లి, జూన్ 20 : మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మండలంలోని వట్టెం, రాంరెడ్డిపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామాల్లో సుమారు 80శాతం మిషన్ భగీరథ తాగునీటి సర్వే పూర్తయ్యిందని, శనివారం వరకు వందశాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని పలువురి లబ్ధిదారుల ఇండ్లను సందర్శించి వారితో మాట్లాడారు. నల్లాల ద్వారా మిషన్ భగీరథ తాగునీరు వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటిని వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాలం ప్రారంభం కావడంతో మురుగు కాల్వలను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేయించాలన్నారు. అనంతరం వట్టెం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రతిరోజు పర్యవేక్షించాలని, విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందాయా లేదా అని తెలుసుకున్నారు. పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీటీవో కృష్ణ, డీఈవో గోవిందరాజులు, ఇన్‌చార్జి సీఈవో గోపాల్‌నాయక్, ఎంపీడీవో కతలప్ప, తాసీల్దార్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

నాగర్‌కర్నూల్, జూన్ 20: నాగర్‌కర్నూల్ జిల్లా జడ్జి రాజేశ్‌బాబును గురువారం నూతన కలెక్టర్ బదావత్ సంతోష్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంచిర్యాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన సందర్భంగా పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోర్టులోని ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లో కలిసి మాట్లాడారు.

కలెక్టర్‌కు సన్మానం

కల్వకుర్తి, జూన్ 20 : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భగవత్ సంతోష్‌ను గురువారం జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఖరీఫ్ 2023-2024 సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని గడువులోగా ఎఫ్‌సీఐకి ఇవ్వాలని రైస్ మిల్లర్లకు సూచించారు.

కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జూలూరి రమేశ్‌బాబు, పాపిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

- ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డి

యూనివర్సిటీ కోసం భూములు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వెల్దండ, జూన్ 20 : కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం వెల్దండ మండలం చెర్కూర్, పెద్దాపూర్ గ్రామ రెవెన్యూ శివారులో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ కోసం ఆర్డీవో శ్రీనివాసులుతో కలిసి భూములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ అనువైన ప్రదేశం ఉంటుందో అక్కడ యూనివర్సిటీని నిర్మిస్తామన్నారు. కల్వకుర్తిలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం సహకారంతో అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ రవికుమార్, సర్వేయర్ అనసూజ, నాయకులు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నీట్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

అచ్చంపేటరూరల్, జూన్ 20 : నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పటేల్ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 24లక్షల మంది నీట్ పరీక్ష రాస్తే 67మందికి మొదటి ర్యాంక్ రావడానికి బీజేపీ ప్రభుత్వమే కారణమని, దీనిపై ప్రధాని మోదీ స్పందించాలని కోరారు. అనంతరం 'భారతదేశ చరిత్ర-కమ్యూనిస్టుల పాత్ర' అనే అంశంపై పార్టీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్, మండల కార్యదర్శి మల్లేశ్, నాయకులు నాగరాజు, శంకర్‌నాయక్, సైదులు, లాలమ్మ, బారిమాం, రాజు, శివకుమార్ పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

కల్వకుర్తి, జూన్ 20 : 14 ఏండ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే, పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేస్తామని కల్వకుర్తి అసిసెంట్ లేబర్ అధికారి మహేందర్‌రావు హెచ్చరిచారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని మెకానిక్, బట్టలు, చికెన్, కిరాణం తదితర దుకాణాల యాజమానులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.14 ఏండ్లలోపు పిల్లలను పనికి కుదుర్చుకోవద్దని, పనిలో పెట్టుకున్నా, వారితో పనిచేయించినా చైల్డ్ లేబర్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ దస్తగిరి, జిల్లా చైల్డ్ ప్రొటెక్ట్ యూనిట్ సభ్యులు మధుబాబు, మల్లేశ్వరీ, ఆంజనేయులు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న అధికారులు

బల్మూర్, జూన్ 20 : మండలంలోని చెన్నారం గ్రామంలో మిషన్ భగీరథ కుళాయిల వివరాలను గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సేకరిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బాలరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి అక్కడ ఫొటో తీసుకొని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు, గ్రామంలో సగానికి పైగా సర్వే పూర్తయిందని చెప్పారు.

ఇప్పటికే మిషన్ భగీరథ అధికారులు హేమలత, ఏఈలు మధుబాబు, సందీప్‌రెడ్డి తదితరులు కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు.

చెంచు మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలి

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

లింగాల, జూన్ 20 : కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మపై విచక్షణారహితంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని చెంచులోకం రాష్ట్ర అధ్యక్షుడు కాట్రాజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది రోజుల కిందట అదేగ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి చెంచు మహిళ అయిన ఈశ్వరమ్మపై విచక్షణారహితంగా దాడి చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. అభంశుభం తెలియని చెంచు మహిళను తన ఇంట్లో పది రోజులు నిర్బంధించిన వెంకటేశ్‌తోపాటు వారి కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు మహేశ్, ఈశ్వరయ్య, సలేశ్వరం, మొగులాలు, సునీల్ పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటటౌన్, జూన్ 20 : ఆదివాసి చెంచు మహిళ కాట్రాజ్ ఈశ్వరమ్మను ఇంట్లో నిర్బంధించి చిత్ర హింసలు పెట్టిన వెంకటేశ్ అతని కుటుంబ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అచ్చంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో చింతపల్లికి చెందిన కాట్రాజు ఈశ్వరమ్మ ఆమె భర్త ఏదన్న సొంత భూమి కౌలుకు తీసుకున్న వెంకటేశ్ వారి కుటుంబ సభ్యులు పదిరోజుల నుంచి వారిని ఇంట్లో నిర్బంధించి చిత్రహింసలు పెట్టారని ఆరోపించారు. ఈశ్వరమ్మను చిత్రహింసలు పెట్టిన వెంకటేశ్ వారి కుటుంబ సభ్యులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీరాం, భాష, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, జూన్ 20 : ఆదివాసి మహిళ ఈశ్వరమ్మను చిత్రహింసలకు గురిచేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం తాసీల్దార్ హిమబిందుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, నాయకులు తిమ్మస్వామి, రాజు తదితరులు ఉన్నారు.

గంజాయి లభ్యం

- ఇద్దరు యువకులపై కేసు నమోదు

బిజినేపల్లి, జూన్ 20 : మండలంలోని గుడ్లనర్వ శివారులోని శ్మశాన వాటికలో నాగరాజు, తరుణ్ వద్ద గంజాయి ప్యాకెట్లు లభ్యమైనట్లు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నాగరాజు, తరుణ్ వద్ద గంజాయి ప్యాకెట్లు ఉన్నాయని తెలియడంతో సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా వారి వద్ద 3.36 గ్రాముల(చిన్న ప్యాకెట్లు) గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భారీగా ఇసుక నిల్వలు స్వాధీనం

తిమ్మాజిపేట, జూన్ 20 : మండల కేంద్రంలో భారీగా ఇసుక నిల్వలు గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టీజీబీసీఎల్ స్టాక్ పాయింట్ వెనుక డంప్ చేసిన సుమారు 315 (15టిప్పర్లు) టన్నుల ఇసుకను తాసీల్దార్ మోహన్, ఎస్సై నరేందర్‌రెడ్డిలు పరిశీలించి సీజ్ చేశారు. దీనిపై నివేదికను కలెక్టర్, ఆర్డీవో, మైన్స్ అధికారులు పంపినట్లు తాసీల్దార్ వెల్లడించారు.

నాటుసారా బట్టీలపై దాడులు

- ఏడుగురిపై కేసు నమోదు

లింగాల, జూన్ 20 : మండలంలోని రాయవరం, ధారారం, పద్మన్నపల్లి, చెన్నంపల్లి, అప్పాయిపల్లి గ్రామాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి ఎక్సైజ్ అధికారులు నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జనార్దన్ తెలిపారు. రాయవరం గ్రామానికి చెందిన ఇద్దరు, ధారారం గ్రామానికి చెందిన ఇద్దరు, పద్మన్నపల్లి, చెన్నంపల్లి, అప్పాయిపల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులను అదుపులో తీసుకొని వారి నుంచి 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, 1700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెల్లడించారు.

భర్తపై కేసు నమోదు

తిమ్మాజిపేట, జూన్ 20 : వివాహం జరిగి ఎనిమిదేండ్లు దాటినా అదనపు కట్నం కావాలని భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని బుద్ధసముద్రం గ్రామానికి చెందిన సునందను రంగారెడ్డి జిల్లా దైతవారానికి చెందిన కిరణ్‌కు ఇచ్చి ఎనిమిదేండ్ల కిందట వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నం కింద నగదు, బంగారం ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఆమె భర్త అప్పులపాలు కావడంతో బంగారం మొత్తం అమ్ముకొని తిరిగి కట్నం తేవాలని మూడేండ్లుగా భార్యను వేధిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దీంతో ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వచ్చిన ఆమె భర్తపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పట్టుబడ్డ వాహనాలకు వేలం

అచ్చంపేటటౌన్, జూన్ 20 : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఎక్సైజ్ అధికారులు గురువారం వేలం వేశారు. పట్టణ సమీపంలో డీపీఈవో గాయత్రి ఆధ్వర్యంలో 10 వాహనాలకు వేలం నిర్వహించారు. ఈవేలం ద్వారా రూ.6,26,580 ప్రభుత్వ ఖజానాలో జమ అయినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

నీట్‌ను రద్దు చేయాలి

కల్వకుర్తి రూరల్, జూన్ 20 : నీట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి శ్రీనివాసులు గురువారం కోరారు. నీట్ పరీక్ష అవకతవలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్య తీసుకోకపోవడం దారుణమన్నా రు. నీట్ పరీక్షలో అవకవతలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు.

బల్మూరు ఇన్‌చార్జి ఎస్సైగా ఇందిర

బల్మూరు, జూన్ 20 : బల్మూరు ఇన్‌చార్జి ఎస్సైగా ఇందిర గురువారం బాధ్యతలను తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై బాలరాజు లీవ్‌పై వెళ్లడంతో ఈగలపెంట ఎస్సై-2గా అక్కడ విధులను నిర్వహిస్తున్న ఇందిరకు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఇందిరకు పోలీస్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అచ్చంపేటరూరల్, జూన్ 20 : వైద్య విభాగంలో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణంలో నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. అనంతరం ఏరియా వైద్యశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్ రుదవత్, రోహిణి పాల్గొన్నారు.

అచ్చంపేట ఆర్డీవో కార్యాలయం సబ్ కలెక్టర్ కార్యాలయంగా మార్పు

అచ్చంపేట, జూన్ 20 : అచ్చంపేట రెవెన్యూ డివిజన్‌కు ఐఏఎస్ క్యాడర్ అధికారిని నియమించి పరిపాలన సౌలభ్యం కోసం సబ్ కలెక్టర్ కార్యాలయంగా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్ కార్యాలయాలను సబ్‌కలెక్టర్ కార్యాలయాలుగా మార్పు చేస్తూ ప్రభుత్వం జీవో 384 విడుదల చేసింది. అందులో అచ్చంపేట రెవెన్యూ డివిజన్‌ను కూడా మార్పు చేసింది. ఇక నుంచి అచ్చంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం సబ్ కలెక్టర్ కార్యాలయంగా కొనసాగుతూ ఐఏఎస్ క్యాడర్ స్థాయి ఉన్న అధికారి విధులు నిర్వహించనున్నారు. అయితే అచ్చంపేటను అప్పటి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కోరిక మేరకు కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించింది. అప్పటి నుంచి నేటి వరకు అచ్చంపేట రెవెన్యూ డివిజన్‌గా కొనసాగగా దీనిని ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తూ ప్రజలకు సులభతరమైన పరిపాలన అందించడానికి సబ్ కలెక్టర్ కార్యాలయంగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అచ్చంపేట ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అచ్చంపేట ప్రాంతంలో ఆదివాసీ గిరిజనులు, బంజారులు, దళితులు, పేదలు నివసిస్తున్న ప్రాంతంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ప్రజలకు సౌలభ్యంగా పరిపాలన అందించడానికి దోహద పడుతుంది. తొందరలోనే ప్రభుత్వం ఐఏఎస్ క్యాడర్ గల స్థాయి అధికారిని అచ్చంపేట సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించనుంది. ప్రస్తుతం అచ్చంపేట ఆర్డీవోగా పనిచేస్తున్న మాధవి బదిలీ కానున్నారు. ఒకవేళ రాష్ట్రంలో సరిపోను ఐఏఎస్ క్యాడర్ గల అధికారులు లేని యెడల ఆర్డీవో స్థాయి అధికారులను కూడా కొనసాగించే అవకాశం ఉన్నది.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలి

లింగాల, జూన్ 20 : నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి డీలర్లను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యాపారుల దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను నాణ్యత ప్రమాణాల నుంచి నమూనాలను తీసి విత్తన ఎరువుల పరీక్షా కేంద్రం (హైదరాబాద్)కు పంపడం జరుగుతుందన్నారు. అక్కడ విత్తనాలలో మొలక శాతం, ఎరువులలో పోషకాల లభ్యత, నాణ్యత ప్రమాణాలను చూస్తారన్నారు. వాటి ఫలితాల ఆధారంగా దుకాణాలపై చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

వెల్దండ, జూన్ 20 : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో 33ను అమలు చేయాలన్నారు. అదేవిధంగా నూతన గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైరాంనాయక్, ప్రధాన కార్యదర్శి విమల్‌నాయక్, శ్రీకాంత్ నాయక్ ఉన్నారు.

ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నాగర్‌కర్నూల్, జూన్ 20 : యూనియన్స్ డేని పురస్కరించుకొని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగర్‌కర్నూల్ మెయిన్ బ్రాంచ్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్, ఐతోల్, తెలకపల్లి, బిజినేపల్లి, ఉయ్యాలవాడ, మంగనూర్ శాఖల లోకల్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఉద్యోగ అవకాశం
★NBFC కంపెని నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం 15K నుండి 20K వరకు ఇవ్వబడును. సం.ప్ర. 8660148086, 9590125555.
NT-MBNR

EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794